క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగమణి

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాంపురం పాల సొసైటీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: రాంపురం పాల సొసైటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రెడ్డి చలపతి, డైరెక్టర్లుగా బాదిరెడ్డి పరుశరాం, అన్నంరెడ్డి బంగారునాయుడు, దొగ్గ శ్రీరాములు, భూమిరెడ్డి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వెన్నెల సన్యాసినాయుడు, కుచ్చు కన్నయ్య, శ్రీను, బంగారునాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యురాలు



పద్మను ఆమె కుమార్తెకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం : రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న 60 ఏళ్ల పద్మ అనే మహిళను ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఆమెను జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఆమెది గాజువాక దరి గంట్యాడ అని తెలియజేయడంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం ఆమెను వ్యానులో తీసుకెళ్లి ఆమె కుమార్తెకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగులేదని, ఊరూరా తిరుగుతుందని పద్మ కుమార్తె తెలిపింది. ఆమెకు పింఛన్ కూడా వస్తుందని తెలియజేసింది. ఆమెను ఇల్లు కదలకుండా చూసుకోవాలని వాసు పద్మ కుమార్తెకు సూచించారు.

రైతు బజార్లలో పార్కింగ్ టెండర్ల గడువు పెంపు

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలో ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏడాది పాటు నిర్వహించడానికి బహిరంగ వేలం నిర్వహణకు ఇచ్చిన గడువును పెంచారు. జులై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈనెల 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువును జులై 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబరు 8.202/2, ఆర్‌ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం -530029ను సంప్రదించాలి. లేదా ఫోన్ 9030819082కు సంప్రదించాలి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- పారిశుధ్య నిర్వహణపై దృష్టి
- డీఐవో చంద్రశేఖర్ దేవ్



వైద్యురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐవో చంద్రశేఖర్ దేవ్



పరవాడలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న డీఐవో చంద్రశేఖర్ దేవ్

పరవాడ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అనకాపల్లి జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐవో)అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. శుక్రవారం పరవాడ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో కీటక జనిత నివారణ కార్యక్రమాల అమలు తీరు తెన్నులను పరిశీలించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నీరు నిల్వ ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో దోమల లార్వాలు పెరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా విష జ్వరాలు సోకిన పీడితులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించే విధానాలపై సూచనలు చేశారు. డెంగ్యూ, మలేరియా, బోధకాలు వ్యాధి గ్రస్తులకు తక్షణ వైద్యం అందించాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. పంచాయతీలతో సమన్వయం చేసుకుని పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. వ్యాధి నిరోధక కార్యక్రమాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీ నిర్వహణ, ఓపీ, మందుల లభ్యత వంటి అంశాల గురించి పీహెచ్‌సీ వైద్యాధికారి హారికను అడిగి తెలుసుకున్నారు. డీఐవో వెంట ఎస్‌వోఏ రామచంద్రరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎం.ఎస్.ఎస్ సాయిరాం, పిహెచ్‌ఎస్ జానకి రామన్, ఫార్మాసిస్ట్ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి జి.అచ్యుతరావు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

సబ్బవరం: వ్యవసాయాన్ని అన్ని విధాల ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమయ్యే విత్తనాలు,ఎరువులు,పురుగుల మందులను రాయితీపై అందించనున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రాయితీపై రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విత్తనాలు అందజేశారు. రైతుల అవసరానికి తగినట్టుగా అన్ని గ్రామాలకు విత్తనాలు,ఎరువులు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు.

అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించేందుకు విధివిధానాలు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, జిల్లా వ్యవసాయ అధికారి కె. అప్పలస్వామి,అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, సబ్బవరం,పరవాడ, పెందుర్తి ఏవోలు పోతల సత్యనారాయణ, సీహెచ్ చంద్రావతి , టి. దుర్గాప్రసాద్, ఏఈవో బాలరాజుతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు,సబ్బవరం,పెందుర్తి మండలాల రైతులు పాల్గొన్నారు.

1 నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సభలు




కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

పెందుర్తి: వచ్చే నెల 1 నుంచి మూడు రోజుల పాటు నగరంలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్, భర్గన్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పి మెజారిటీ తగ్గించారన్నారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన చేయకపోతే బీజేపీని ఇంటికి పంపుతారన్నారు. రాష్ట్ర సమితి సమావేశాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సానుభూతి పరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891-2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన.. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

రక్తహీనతకు చెక్ పెడదాం



గంభీరం వెల్‌నెస్ సెంటర్‌లో మాత్రలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం ఆనందపురం మండలంలో పర్యటించింది. బోయిపాలెం, చందక, గంభీరం పంచాయతీల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించిన తరువాత బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రక్తహీనతను నివారించే మాత్రలు ప్రతి శుక్రవారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను పరిశీలించారు. గంభీరం, చందకలలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనతకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్.పూజిత, ఎనీమియా ముక్త్ భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ అధికారి మనోరమ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఐసీడీఎస్ భీమిలి పీవో మామిడి శ్రీదేవి, పర్యవేక్షకురాలు రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

యునిసెఫ్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థుల హాజరు



హ్యూస్టన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సమ్మిట్ ఎస్ఏఈలో భీమిలి మండలం శిగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమస్యలు చర్చించి పరిష్కారాలు సాధించడానికి జరిగిన ఈ సమ్మిట్‌లో ఓక్రిడ్జ్‌కు చెందిన ఎస్. సూర్యతేజ్, వి.ఆన్యా, బి.సృజన్ పాల్గొన్నారు. సమ్మిట్‌లో అద్భుతమైన నాయకత్వం, పట్టుదల ప్రదర్శించారని స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యతో మొదలుకుని పర్యావరణ మార్పుల వరకు వివిధ అంశాలపై విద్యార్థులు లోతైన చర్చల్లో పాల్గొన్నారని పేర్కొంది. ఈ సమ్మిట్‌లో నార్త్ అంగ్లియాకు చెందిన 120 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి



శంకరరావు(ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రి వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో.. కరెంట్ షాక్‌కు గురై హెల్పర్ సిరపురపు శంకరరావు(51) మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. సింహాచలం సాయినగర్‌కు చెందిన సిరపురపు శంకరరావు లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద విద్యుత్ సమస్య ఉండడంతో.. స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా దెబ్బలు తగిలాయి. వెంటనే అతన్ని బెహరా ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేత్ర పర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకాలు చేస్తున్న అర్చకుడు



వెండి ఆభరణం అందిస్తున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. ఎన్‌ఆర్‌ఐ భక్తులు మోహన్, పద్మిని 250 గ్రాముల వెండి యగ్నోపవేథానిని స్వామివారికి సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, కార్పొరేటర్ వసంత



పూజలందుకున్న పంచముఖ ఆంజనేయస్వామి

పెందుర్తి: చినముషిడివాడలోని కార్యసిద్ధి పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సహస్ర నాగవల్లీ సహిత సింధూరార్చన, విశేష అలంకరణ, అర్చన, నక్షత్ర హారతి, మంత్ర పుష్పం జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. దాదాపు 8 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త శానాపతి శంకర్రావు, కార్పొరేటర్ శానాపతి వసంత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గణబాబు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, పలువురు నాయకులు, భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈ సెక్టార్ పాత్ర కీలకం



సదస్సులో పాల్గొన్న నిపుణులతో ఏయూ అలుమ్ని చైర్మన్ శంకరరావు

ఎంవీపీ కాలనీ: దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈ సెక్టార్ పాత్ర కీలకమని ఆర్థిక రంగ నిపుణుడు వసంతరావు సత్యవెంకటరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయంలోని జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో టైప్స్ ఆఫ్ ఫైనాన్సింగ్ ఫర్ ద ఎంఎస్ఎంఈ సెక్టార్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఏయూ అలుమ్ని, ఏయూ ఆ హాబ్, కలాం డ్రీమ్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్థికరంగ నిపుణుడు వసంతరావు సత్యవెంకటరావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రంగంలో ఆర్థిక తోడ్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. పలు రకాల ఫైనాన్సింగ్ ఆప్షన్స్ ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఆర్థిక తోడ్పాటును అందిపుచ్చుకొని లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ ఈ.శంకరరావు, భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పికొండ, ఎంఎస్ఎంఈ రాష్ట్ర కమిటీ చైర్మన్ ఎస్. పాండురంగ ప్రసాద్, ఏపీ పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ గణపతి తదితరులు పాల్గొని ఎంఎస్ఎంఈ పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలను వివరించారు.

వైభవోపేతం.. భువన విజయం



భువన విజయం సాహితీ రూపకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి



హాజరైన భక్తులు, సాహితీప్రియులు

సీతంపేట: శ్రీకృష్ణదేవ రాయలు కాలంలో అష్టదిగ్గజాలతో భువన విజయం సభ నిర్వహించేవారని పుస్తకాల్లో చదివాం, సినిమాలలో చూసి ఉంటాం. కానీ అప్పటి రాయల వారి వైభవం, ఆహార్యం, కవుల సాహితీ ప్రతిభ, చమత్కారం చూసే భాగ్యం మనకు లేదనే చెప్పాలి. శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృందం ప్రదర్శించిన 'భువన విజయం సాహితీ రూపకం' అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. సభికులను శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసాస్వాదనకు లోనుచేశారు.డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణరాజు ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ దేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళిసూరనగా చౌదూరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లం రాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సి.యం.కె.గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుడూరు సూర్యనారాయణమూర్తి తమదైన శైలిలో అద్భుత ఆహార్యం, పద్యపఠనంతో అలరించారు. ఈ సందర్భంగా అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడుతూ మతసామరాస్యాన్ని చక్కగా పాటించి ప్రజా సంక్షేమం కోసం సుపరిపాలన అందించిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు అని కొనియాడారు. ఆ మహా చక్రవర్తి సాధించిన విజయాలను పక్కనపెడితే భాషాపరంగా ఆయన చేసిన కృషి ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఏ రాజు, ఏ ప్రభుత్వం చెయ్యలేదనే చెప్పాలన్నారు. అష్ట దిగ్గజ పాత్రధారులు తమదైన అద్భుత ప్రతిభతో దత్తపది, సమస్య పూరణ, వర్ణనలతో సభను రక్తికట్టించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన భువనవిజయం సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీవేత్తలు చూసి తరించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిధ్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.